ISSN:3048-5908 Impact Factor: 5.379 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct/Nov/Dec),2025

# "పిడికెడు ఆత్మగౌరవం కోసం - కవితా పరామర్శ"

**భాగం సైదారావు**

పరిశోధక విద్యార్థి,తెలుగుశాఖ,ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

చరవాణి : 9542439152

Gmail : bagambalusaidarao@gmail.com

Article Received: 10/11/2025

Article Accepted: 20/12/2025

Published Online: 26/12/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2.4.190

**సారాంశం**

దళిత సాహిత్య చరిత్రలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన శ్రీ కలేకూరి ప్రసాద్‌గారు రచించిన *"పిడికెడు ఆత్మగౌరవం కోసం"* కవిత దళితుల ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచింది. ఈ కవితలో దళితులపై శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, హింసలను కవి ఆవేదనతో చిత్రించారు. కంచికచెర్ల, కారంచేడు, చుండూరు వంటి దళిత మారణకాండలను ప్రస్తావిస్తూ సమాజంలోని అగ్రవర్ణ ఆధిపత్య ధోరణిని తీవ్రంగా ఖండించారు. దళితుల శ్రమతో దేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ వారికి సమాన హక్కులు, గౌరవం లభించకపోవడాన్ని కవి ప్రశ్నించారు. కవిత అంతటా తిరుగుబాటు స్వరం, ఆత్మగౌరవ చైతన్యం, సామాజిక న్యాయం పట్ల ఆకాంక్ష వ్యక్తమవుతుంది. దళితులు బాధితులు మాత్రమే కాకుండా పోరాట యోధులని కవి స్పష్టం చేశారు. ఈ కవిత దళితుల అస్థిత్వ ప్రకటనకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సాధనకు మార్గదర్శిగా నిలుస్తుంది. సమానత్వం, మానవత్వం, సామాజిక చైతన్యం అవసరాన్ని ఈ కవిత బలంగా ప్రతిపాదిస్తుంది. అందువల్ల ఈ కవిత తెలుగు దళిత సాహిత్యంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది.

**కీలక పదాలు :** దళిత సాహిత్యం, ఆత్మగౌరవం, కులవివక్ష, కలేకూరి ప్రసాద్, దళిత చైతన్యం

దళిత సాహితీ చరిత్రలో ఉవ్వెత్తున ఎగసి, అంతలోనే అమరుడైన దళిత విప్లవ యువ కెరటం శ్రీ కలేకూరి ప్రసాద్‌గారు. దళిత సాహిత్యంలో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకుని హరిజనుల, పంచముల అస్థిత్వ పోరాటంలో తనూ ఒక కవిత ఆయుధమై దళిత సోదరుల చైతన్యానికి రెండు జాతులతో ఎర్రజెండా, ఎత్తి అణగారిన వర్ణాల ఆత్మగౌరవానికై అహర్నిశలు ఆలోచన చేసిన మహామనిషి కలేకూరి ప్రసాద్. ఈ భూమిపై నాగరికత అభివృద్ధి చెందుతున్నప్పటి నుంచి ఎన్నో ఉద్యమాలు, విప్లవాలు, ప్రజా పోరాటాలు వచ్చాయి. అయితే అటువంటివన్నీ కూడా కేవలం అణగారిన వర్గాల పీడనను నినదించి, పాలకుల ఆధిపత్యాన్ని తెగ నరికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం జరిగినవే. అటువంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ భరత భూమిలోని ఒక వర్గం కన్నెత్తి కూడా చవిచూసి ఎరుగదు. అటువంటి దళితులు నిత్యం వెతలకు గురవుతూ, అగ్రవర్ణాల ఆధిపత్యంతో అణువణువునా బలైపోతూ ఆర్థిక, సాంఘిక రంగాల్లో వెనుకబాటుకు గురై బానిసకొక బానిసగా బ్రతుకు వెల్లదీస్తున్న వైనాన్ని తెలుపుతూ తెలుగునాట వచ్చిన దళితోద్యమం దిశగా దళితులు, పంచముల యొక్క ఆత్మ గౌరవ, అస్థిత్వ ప్రకటనా దిశ సాగి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆకాంక్షించింది. అటువంటి దళితోద్యమంలో తాను ఒక పూచిక పుల్లలా మారి దళితుల ఆత్మగౌరవ ప్రకటనే ధ్యేయంగా కలేకూరి ప్రసాద్‌గారు రాసిన ఈ పిడికెడు ఆత్మగౌరవం కోసం అనే కవిత నేటి దళితుల మాన్యువల్‌గా చెప్పవచ్చు.

కలేకూరి ప్రసాద్ గారు 1962 అక్టోబర్ 25వ తేదీన కృష్ణాజిల్లా కంచికచెర్లలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లలితా సరోజిని, శ్రీనివాసరావులు ఇద్దరూ ఉపాధ్యాయులే. ప్రసాద్‌గారు కవిగా, సినీ గీత రచయితగా, సాహితీ విమర్శకుడుగా, మార్క్సిస్టు విశ్లేషకుడుగా, దళిత ఉద్యమకారునిగా, జననాట్యమండలి, విప్లవ రచయితగా పేరుగాంచారు. ఈయన తన స్వగ్రామమైన కంచకచెర్లలో కోటేసు అనే యువకున్ని పెత్తందార్లు సజీవ దహనం చేయడంతో చలించిపోయి పీపుల్స్‌వార్‌లో చేరాడు. పార్టీ రాజకీయ పాఠశాలల్లో బోధకుడుగా పని చేశాడు. కారంచేడులో దళితుల మారణకాండతో దళిత ఉద్యమంలోకి అడుగిడుతూ పీపుల్స్ వార్ నుండి బయటకు వచ్చి శివసాగర్ వంటి నాయకులతో కలసి పలు ప్రజా, దళిత ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. డర్బన్‌లో జాతి వివక్షపై జరిగిన చారిత్రక అంతర్జాతీయ సదస్సులో కలేకూరి పాల్గొన్నాడు. ఈయన "యువక" అనే కులం పేరుతో కవితలు రాస్తూ "మండుతున్న చుండూరు", దళిత కవిత్వం లాంటి కవితా సంకలనాల్లో కవితలు రాసారు. ఈయన రాసిన పలు పాటలు చలనచిత్రాల్లో బహుప్రాచుర్యం పొందాయి. శ్రీరాములయ్య సినిమాలో రాసిన "భూమికి పచ్చని రంగేసినట్లూ అమ్మలారా" పాట కారంచేడును ఉద్దేశించి రాసినది. ఈయన దళిత సాహిత్యం, దళిత కిరణాలు, దళిత ఉద్యమం ` దళిత సాహిత్యోద్యమం, ఆంధ్రప్రదేశ్ దళితులు, పిడికెడు ఆత్మగౌరవం కోసం, అంటరాని ప్రేమ వంటి స్వీయ రచనలు వెలువరించారు. అదే విధంగా ఎన్నో కవిత సంకలనాల్లో ఈయన కవితలు చోటుచేసుకున్నాయి. అందువలన వ్యాస పరిధిని దృష్టిలో

ఉంచుకుని కేవలం "పిడికెడు ఆత్మ గౌరవం" కోసం అనే కవితను మాత్రమే తీసుకుని వివరించగలనని మనవి చేయగలను.

కలేకూరి ప్రసాద్ గారు తాను స్వయంగా చూసిన సంఘటనల ఫలితమే పిడికెడు ఆత్మగౌరవం అనే కవిత. ఇందులో కంచికచెర్ల, చుండూరు, కారంచేడు వంటి దళిత మారణకాండాల్ని పేర్కొంటూ ఈ కర్మభూమిలో మానవత్వం మాసిపోయిందని తెలుపుతూ తరాలుగా అగ్రవర్ణాల ఆధిపత్య ధోరణితో బానిస బ్రతుకులు బ్రతుకుతున్న దళితుల దీనావస్థలను గురించి తెలుపుతూ

"నేను ఎప్పుడు పుట్టానో తెలియదు గానీ
వేల ఏళ్ళ క్రితం ఈ గడ్డ మీదనే చంపబడ్డాను
పునరపి మరణం పునరపి జననం
నాకు కర్మ సిద్ధాంతం తెలియదు కానీ
మళ్ళీ మళ్ళీ మరణించిన చోటనే పుడుతున్నాను"

హిందూ వ్యవస్థ కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని దగా చేసి దోచుకుతింటున్న అగ్రవర్ణాల ఆచారాలు, వారి కట్టుబాట్ల పేరుతో దళితులపై జరుపుతున్న అమానుష దాడుల్ని ఖండించారు కలేకూరి ప్రసాద్ గారు. శతాబ్దాలు గడుస్తున్న దళితుడు ఇంకా అవే వేదకాలం నాటి పరిస్థితులను, ఎదుర్కొంటున్నాడని, వారికి ఏవిధమైన మార్పు రాలేదనీ, సమాజంలో వారిపై జరిగే దాడులు, దమనకాండలు అలానే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మళ్ళీమళ్ళీ మరణించిన చోటనే పుడుతున్నాను అంటూ ఈ కర్మబంధాల నుండి ఈ హిందూ వ్యవస్థ దళితులకు ముక్తిని, స్వేచ్ఛను ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించాడు. అయితే ఈ వాక్యలు గమనించినట్లయితే భోయిభీమన్నగారు గుడిసెలు కాలిపోతున్నాయ్ కవితలోని "కాలిపోయిన స్థానంలో ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటాయి" అన్న వాక్యలను అనుసరించి ఇద్దరు కవులూ తెలిపింది ఏమిటంటే, కాలాలు మారినా సమాజంలో మార్పు రావట్లేదని, దళితుల పరిస్థితులు అదే రీతిలో ఉంటూ నిత్యం వెతలకు గురవుతూనే ఉన్నారని తెలియజేయడం గమనించవచ్చు. అదే విధంగా

"నా కనుగుడ్లు కన్నీరై ద్రవిస్తే
ఈ దేశంలో జీవనదులు ప్రవహించాయి
నా సిరల నుండి జీవధాతువులు స్రవిస్తే
ఈ దేశం సస్యశ్యామలమై సిరులు కురిసింది"

ఈ భరతభూమి అభివృద్ధికి పంచములే పుణాదులై అహర్నిశలూ శ్రమించి, రక్తం దారపోసి తన భుజస్కందాలపై నిలిపి పోషిస్తున్నారనే, వారి శ్రమ ఫలితమే ఈ భరతభూమి నేటి అభివృద్ధికి కారణమని

ISSN:3048-5908 Impact Factor: 5.379 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct/Nov/Dec),2025

తెలియజేస్తున్నారు. దళితులు బానిసత్వంలో వెట్టిచాకిరీలో నిలువెల్లా నీరై కరిగిపోతున్నారనే, అయినప్పటికీ వారికి తినడానికి, తాగడానికి కూడా గతిలేక నిర్భాగ్య జీవితాలు అనుభవిస్తున్నారనీ వాపోతూ

"త్రేతాయుగంలో నేను శంభూకుణ్ణి
ఇరవై రెండేళ్ళ క్రితం నా పేరు కంచికచర్ల కోటేశు
నా జన్మస్థలం కీలవేణ్మణి కారంచేడు, నీరుకొండ
ఇప్పుడు కరుడు గట్టిన భూస్వామ్య క్రౌర్యం
నా గుండెల మీద నాగేటి కర్రులతో పచ్చ బొడిసిన పేరు చుండూరు
ఇక చుండూరు నామవాచకం కాదు సర్వనామం"

ఈ పుణ్యభూమిలో దళితుల రక్తం చిందని ప్రదేశం అణుమాత్రమైనా లేదని, గడియకో హత్య, లిప్తలో అవమానంలో ఈ హైందవ భూమిని అగ్రవర్ణాల వారు పునీతం చేస్తున్నారనీ ప్రతీకగా చెపుతూ, ఆంధ్రదేశంలో దళితుల పరిస్థితి మరింత దిగజారి పోతుందనే అగ్రవర్ణాల వారి జాత్యాహంకార ఆధిపత్య ధోరణి దళితుల్ని సమూలంగా నాశనం చేసేంత వరకు నిద్రపోదని తెలిపుతూ, తనని తాను శంభూకునితో పిల్చుకుంటూ వేదకాలం నుండి దళితులకు రక్షణ కరువైందనే చేదు నిజాన్ని తన కవిత్వం ద్వారా తెలియజేశాడు. దళితవాడలపై అగ్రవర్ణాల వారి క్రౌర్యం రక్తపుటేరులు ప్రవహింపజేస్తుంది. కంచికచర్లలో కోటేసు సజీవ దహనం చేయడం, 1980లో కారంచేడులో దళితవాడపై అగ్రవర్ణాల వారు చేసిన దాడిలో సుమారు 30 మందిని వెంటాడి, వేటాడి చంపిన సంఘటన, అదే విధంగా చుండూరులో 1991లో సుమారు 8 మందిని నరికి, ముక్కలు చేసి తుంగభద్రలో వేసిన ఘటన మానవత్వాన్ని హత్య చేసిన దినంగా వర్ణించవచ్చు. అలాంటి మానవత్వానికి మాయనిమచ్చలా పరిణమించిదని ఈ సంఘటనలపై శ్రీ కలేకూరి ప్రసాద్ గారు ఎంతో ఆర్తితో కవిత్వం రాస్తూ ఇక చుండూరు సర్వనామమని, సమస్త దళితుల యొక్క నామవాచకమని తెలిపారు. ముఖ్యంగా కరుడు కట్టిన కులవాదం, అంతకుమించి భూస్వాముల యొక్క ధనాధికారంతో చుండూరులో రక్తపుటేరులు పారించిన వైనాన్ని రచయిత ఆవేదనగా వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో దళితుల యొక్క అభ్యున్నతి, వారిపై గల ద్వేషం, పగ, ప్రతీకారాలే అగ్రవర్ణాల వారిని ఈ మారణ కాండకు ఉసిగొలిపాయని చెప్పవచ్చు. అదే విధంగా తరతరాలుగా ఈ దేశ మూలవాసులైన దళితులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేక, విద్యకు దూరంగా ఉంచబడి, సంపదకు దూరం చేసి, వెట్టిచాకిరీ చేయించుకుని బతుకు దుర్భరం చేసి నిత్యం అవమానాలకు, అత్యాచారాలకు, మానభంగాలకు, చిత్రహింసలకు గురి చేస్తున్న ఈ అగ్రవర్ణాల వారిపై ఆత్మ గౌరవ పోరాటం తీసుకురావాలని, అప్పుడే దళిత చైతన్యం అవతరిస్తుందని తెలుపుతూ

"నేను బాధితున్ని కాదు అమరుణ్ణి
ఎగిరే ధిక్కార పతాకాన్ని

ISSN:3048-5908 Impact Factor: 5.379 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct/Nov/Dec),2025

నా కోసం కన్నీరు కార్చకండి
మీకు చేతనైతే
నన్ను నగరం నడిబొడ్డున ఖననం చేయండి"

అంటూ తన ధిక్కార స్వభావాన్ని దిగంతాలకు వ్యాపించేలా సవాలు విసురుతున్నాడు. నిజమే ఇప్పుడు దళితులకు కావల్సింది దయ, జాలి చూపడమో, కన్నీరు కార్చడమో, ఊరడింపు మాటలు చెప్పడమో కాదు. సామాజిక న్యాయం కావాలి. సంఘంలో సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి. కలేకూరి చెప్పినట్లు దళితులు బాధితులు కాదు అమరులు. ఎందుకంటే ఈ అసమసమాజ కులనిర్మూలనా పోరాటంలో కుహనవాదుల కుతంత్రాల వ్యూహంలో అశువులు బాసి, తనువులు చాలించిన అమరులని కలేకూరి దళితుల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపజేసారు. తాను ఎగిరే ధిక్కార పతాకం అని చెపుతూ తన కోసం కన్నీరు కార్చవద్దని చెపుతూనే, నగరం నడిబొడ్డులో దహనం చెయ్యమని సవాలు విసురుతున్నాడు. ఎందుకంటే దళితులు ఏనాడు సగర్వంగా తల ఎత్తుకుని తిరగలేదు, కాళ్ళకు పాదరక్షలు, వంటి నిండా వస్త్రం ఉన్నా చూసి సహించలేని జాత్యాహంకారులున్న ఈ దేశంలో దళితునికి స్వేచ్ఛ అనే పదానికి అర్థం కూడా తెలియదని, వారికి పల్లె వీధుల్లో నడిచే స్వేచ్ఛ లేనప్పుడు నగరం ప్రవేశం కూడా దుర్లభమని తెలుపుతూ, మనిషికే ప్రవేశం లేని నగరంలోకి శవాన్ని తీసుకెళ్లి దహనం చేయండంటూ సవాలు విసురుతున్నాడు. ఎందుకంటే తాటాకు చప్పుళ్ళు వంటి మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం మానుకుని చేతల్లో దళిత జనోద్ధరణ జరగాలని ఆవేశంలో రాసిన వాక్యలివి.

రచయిత కలేకూరి ప్రసాద్ కవిత్వాన్ని పరిశీలించినట్లయితే అందులోని లోటుపాటులు గమనించినట్లయితే ఇంతవరకు జరిగిన అనేక సంఘటనలను ఉదాహరణలు తీసుకుని తన కవిత్వంలో పొందుపరిచారు. ముఖ్యంగా దళిత నరమేధ సంఘటనలు అయిన కారంచేడు, చుండూరు, నీరుకొండ, కంచికచర్లను ఈ కవితలో చిత్రిస్తూ, అగ్రవర్ణాలవారి జాత్యాహంకార ధోరణితో పాటు, సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నా కూడా మానసిక బలహీనులైన దళితుల నిర్బలత్వాన్ని తెలియజేసారు. అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక వైకల్యాలు దళితుల పాలిట మరణమృదంగమైనప్పుడు యముని మహిషగింటికలు ఆయా గ్రామాల్లో వినిపించిన దళితులు చావుకేకల యొక్క మానసిక వేదన ఆధారంగా కలేకూరి ప్రసాద్ ఈ దళిత మరణ మృదంగ మయమైన అక్షరాలతో తన ఆవేశాన్ని ప్రకటించారు రచయిత.

"ఒక పెనుమంటల పెనుగులాటనై
మళ్ళీమళ్ళీ ఈ దేశంలోనే ప్రభవిస్తాను" .

**ఆధార గ్రంథాలు:**

ISSN:3048-5908 Impact Factor: 5.379 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct/Nov/Dec),2025

కలేకూరి ప్రసాద్. *పిడికెడు ఆత్మ గౌరవం కోసం.*

లక్ష్మీనరసయ్య, జి., మరియు త్రిపురనేని శ్రీనివాస్. *చిక్కనవుతున్న పాట. తెలుగు కవితోద్యమాలు.* తెలుగు అకాడమీ.

సిమ్మన్న, వెలమల. *తెలుగు సాహిత్య చరిత్ర.*

"అంతర్జాల సమాచారం." *వెబ్.* దర్శించిన తేదీ: 25 మే 2026.